క్లుప్తంగా

నవధాన్యాల సాగుతో రైతులకు మేలు



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కంచిలి: ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా నవధాన్యాలు సాగు చేయడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ దుర్గాప్రసాద్, ఇన్‌చార్జి శీర కామరాజులు అన్నారు. మండలంలోని బూరగాం గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగు, దాని వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


గణిత ధారణ ప్రక్రియతో మేలు



గణిత ధారణ ప్రక్రియ చేపడుతున్న తిరుపతిరావు

కంచిలి: విద్యార్థులు చదువుకున్న విషయాలు ఎక్కువకాలం గుర్తుంచుకోవడానికి గణిత ధారణ ప్రక్రియ దోహదపడుతుందని గణిత అవధాని మద్దు తిరుపతిరావు అన్నారు. మండలంలోని చొట్రాయిపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో కళ్లకు గంతలు కట్టుకొని గణిత ధారణ ప్రక్రియను శుక్రవారం చేపట్టారు. కార్యక్రమంలో సమీప గ్రామాల నుంచి ఉన్నత పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మృతదేహం కోసం నిరీక్షణ



దామోదర్ పాస్‌పోర్టు

కాశీబుగ్గ: ఉపాధి కోసం పోలాండ్ దేశానికి వెళ్లిన పలాస మండలం తర్లాకోట పంచాయతీ ఖైజోల గ్రామానికి చెందిన బుడత దామోదర్ (33) మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన ఈనెల 21వ తేదీన మరణించినట్లు సమాచారం వచ్చింది. ఇప్పటికి ఐదు రోజులు గడిచినా మృతదేహం స్వగ్రామానికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు. తక్షణమే అధికారులు, నాయకులు కలుగజేసుకుని మృతదేహం స్వగ్రామానికి చేరేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలి

ఇచ్ఛాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ, ఎంబైపీసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ(వృత్తివిద్య) కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తలసేమియా చిన్నారికి రక్తదానం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని సూదికొండకు చెందిన నాని అనే యువకుడు తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. తలసేమియాతో బాధపడుతున్న మానస అనే చిన్నారికి రక్తదానం చేసి ఆదుకున్నాడు. బాధితురాలికి ప్రతినెలా రక్తం ఎక్కించాల్సినఅవసరం ఉంది.

రికార్డు అసిస్టెంట్‌కు సన్మానం

సోంపేట: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఉత్తమ రికార్డు అసిస్టెంట్‌గా బేసిరామచంద్రాపురం రికార్డు అసిస్టెంట్ ఎం.కృష్ణభగవాన్ రెడ్డి పురస్కారం అందుకున్నారు. దీంతో ఆయనను గ్రామంలోని ఉన్నత పాఠశాలలో పాఠశాల సిబ్బంది శుక్రవారం సన్మానించారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు



ఎంపీడీవో ఉదయ్‌కుమార్‌ను అభినందిస్తున్న అధికారులు, నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు అందుకున్న ఎన్.రమేష్ నాయుడుని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అధికారులు, నాయకులు అభినందించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

సోంపేట: సత్యసాయిబాబా పుట్టినరోజు పురస్కరించుకొని సుంకిడి ఎంపీటీసీ నిమ్మన లీలారాణి సోంపేటలో చలివేంద్రం శుక్రవారం ప్రారంభించారు. దీనిలో భాగంగా ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కాలనీలపై కక్ష ఎందుకు..?



మౌలిక వసతులకు నోచుకోని జగతిమెట్ట కాలనీ

- వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మించిన కాలనీలపై ప్రభుత్వం వివక్ష
- మౌలిక సదుపాయాలు కల్పించని వైనం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలు



కాలనీలో గోతులమయంగా ఉన్న రోడ్డు

టెక్కలి:

రాష్ట్రంలో ఇళ్లలేని నిరుపేదలు ఉండకూడదనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, సామాన్య వర్గాలకు వైఎస్సార్, జగనన్న కాలనీల పేరుతో సొంత ఇంటి స్థలాలు అందజేసి ఇళ్లను నిర్మించారు. అప్పట్లో కాలనీలకు కంకర రోడ్లు, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు, మంచినీటి సదుపాయాలు కల్పించారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా కాలనీలపై వివక్షత చూపుతున్నారు. కాలనీలో మౌలిక సదుపాయాల విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. మరోవైపు అక్రమ నిర్మాణాలు సైతం చోటు చేసుకుంటున్నాయి.

జగతిమెట్ట కాలనీపై వివక్షత

టెక్కలి జాతీయ రహదారికి ఆనుకొని జగతిమెట్ట సమీపంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 389 మందికి ఇంటి స్థలాలు అందజేశారు. అప్పట్లో గ్రావెల్ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, మంచినీటి కుళాయిలు తదితర వసతులు కల్పించారు. గత ప్రభుత్వం వరకు అన్ని రకాలుగా మౌలిక వసతులు బాగానే ఉండేవి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రస్తుతం మంచినీటి కుళాయిలు భూమిలో కలిసిపోయాయి. విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు దిష్టిబొమ్మలా మారాయి. రోడ్లు పూర్తిగా గోతులు ఏర్పడి నడవడానికి వీలు లేకుండా పోయాయి. తమకు మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులంతా పలు మార్లు అధికారులు చుట్టూ తిరిగినప్పటికీ ఎటువంటి ప్రతిఫలం కనిపించలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లె పండుగ పేరుతో కొన్ని గ్రామాల్లో అవసరం లేనిచోట్ల సీసీ రోడ్లు వేస్తున్నారు తప్పా, జగనన్న కాలనీలపై మాత్రం వివక్షత చూపుతున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇబ్బందులు పడుతున్నాం



మా కాలనీలో రోడ్లు, నీటి సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రాత్రివేళల్లో పూర్తిస్థాయిలో వీధి దీపాలు వెలగకపోవడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయి. అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలి.

– టి.శారద, జగతిమెట్ట సమీపంలోని కాలనీ

ఫలితం కనిపించడం లేదు



కాలనీలో రోడ్లు, మంచి నీరు, వీధి దీపాల కోసం అధికారుల చుట్టూ తిరిగాం. అయినా ఎటువంటి ఫలితం కనిపించడం లేదు. వర్షం పడితే చాలు రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారుతున్నాయి. వీధులు పూర్తిగా చీకటిగా మారుతున్నాయి. మాపై దయచూపి మౌలిక సదుపాయాలు కల్పించండి.

– బి.పుణ్యావతి, జగతిమెట్ట సమీపంలోని కాలనీ



కాలనీలో పనిచేయని మంచినీటి బోరు

అక్రమాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇదే కాలనీలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల అధికారులు దర్యాప్తు చేపట్టి అక్రమంగా నిర్మాణం చేసిన పునాదులను కూల్చివేశారు. మరికొన్ని చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అక్రమాల విషయంలో అధికార పార్టీ కార్యకర్తల చేతివాటం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అక్రమ నిర్మాణం(పక్కనే అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు)

అగ్నిప్రమాద బాధితులకు సాయం



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న తిలక్

టెక్కలి: ఇటీవల కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రాపురం పంచాయతీ సాలిపేట గ్రామంలో అగ్ని ప్రమాదం జరగడంతో నష్టపోయిన బాధితులకు వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. సాలిపేట గ్రామంలో మార్పు భూషణంకు చెందిన వరిచేను నూర్పు చేస్తుండగా అకస్మాత్తుగా ట్రాక్టర్ నుంచి మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో రైతు భూషణంకు చెందిన రెండు ఎకరాల వరిచేను అగ్నికి ఆహుతి కాగా, బల్లి అప్పలరాజు మహేష్‌కు చెందిన ట్రాక్టర్, నూర్పిడి యంత్రం కాలిపోయాయి. దీంతో ఇరువురికీ రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.20 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.హేమసుందర్‌రాజు, జెడ్పీటీసీ దుబ్బ వెంకట్రావు, సర్పంచ్ జి.కేశవరావు నాయకులు ఎస్.సత్యరాజ్, పి.వెంకట్రావు, బి.దివాకర్, పి.సత్యం, కె.సంజీవరావు, ఎస్.జనార్ధన్‌రావు, టి.గణపతిరావు, బి.కామరాజు, టి.రమణారావు, కె.కృష్ణమూర్తి, ఎం.అప్పలనాయుడు, జి.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శలు



తడక యశోదను పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, పిరియా విజయ తదితరులు

సోంపేట: మండలంలోని పలాసపురం సర్పంచ్ తడక జోగారావు, జెడ్పీటీసీ తడక యశోదల కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయలు శుక్రవారం పరామర్శించారు. సర్పంచ్ తడక జోగారావు తల్లి అన్నపూర్ణమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేశారు. వీరితో పాటు ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, సోంపేట, కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాస్, పైల దేవదాస్ రెడ్డి, కంచిలి జెడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షి, పార్టీ నాయకులు ఇప్పిలి కృష్ణారావు, శిలగాన భాస్కరరావు, బతకల మోహనరావు, ఎస్.హరీష్, బైపల్లి రామారావు తదితరులు ఉన్నారు. అలాగే బారువ మేజర్ పంచాయతీలోని పిట్ట పోలయ్య తండ్రి అనారోగ్యంతో ఉండడంతో అతడిని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్‌లు పరామర్శించారు. అదేవిధంగా బారువ కొత్తూరు గ్రామంలో పెద్దింటి అంకమ్మ, వాడపాలేం గ్రామంలో గొరకల ముత్యాలు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్ది చంద్రశేఖర్, కర్రి సత్యం, అమర లోకనాథం, దున్న మాధవరావు, భాస్కరరావు తదితరులు ఉన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి



ర్యాలీ చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

టెక్కలి: తమ సంక్షేమానికి తగిన నిధులు వెచ్చించాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో టెక్కలిలో శుక్రవారం ర్యాలీ చేపట్టారు. తామంతా సంక్షేమ బోర్డు పరిధిలో ఉంటూ డబ్బులు చెల్లిస్తున్నామని, అయితే తమ సంక్షేమానికి నిధులు కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పెండింగ్ క్లెయిమ్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక కార్మిక శాఖ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్.షణ్ముఖరావు, జి.త్రినాథ్, టి.అప్పన్న, డి.లక్ష్మీనారాయణ, బి.హరి, కె.ఆనంద్, ఎస్.ఉత్తర పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి అమలు చేయాలి



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

టెక్కలి: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా తక్షణమే నిరుద్యోగ భృతి హామీ అమలు చేయాలని ఏఐవైఎఫ్ నాయకుడు ఎం.యుగంధర్ డిమాండ్ చేశారు. మే 15 నుంచి 18 వరకు తిరుపతిలో జరగనున్న మహాసభలకు సంబంధించి టెక్కలిలో పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల భర్తీ జరగడం లేదన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నిరుద్యోగ సమస్యలపై చేపడుతున్న మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.శ్రీనివాస్, కిరణ్, గోవింద్, మోహన్, నితిన్, కార్తీక్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: నువ్వలరేవు తీరం నుంచి వేటకు వెళ్లి ఇటీవల మృతి చెందిన మంచినీళ్లపేట మత్స్యకార కుటుంబాలకు ఆ గ్రామానికి చెందిన సీమెన్ అసోసియేషన్, గ్రామ యువత కలిసి శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. మంచినీళ్లపేటలో మృతుడు బుంగ ధనరాజు కుటుంబం నిరుపేదలు కావడం, ఇద్దరు చిన్నారులు ఉండడంతో ఆ కుటుంబానికి రూ.1.20 లక్షలు, వంక కృష్ణ కుటుంబానికి రూ.30 వేలు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. కుటుంబ అవసరాల కోసం తమ వంతు సహాయం చేశామని యువకులు తెలిపారు. కార్యక్రమంలో వంక రాజు, గోసాల సంతోష్, వంక జోగారావు, కావల్ల మోహనరావు, మద్దు రామారావు, గుల్ల బాబీ, కె.రామారావు, వంక మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫయాజ్ అహ్మద్

మందస: స్థానిక ముస్లిం కాలనీలో వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై ముస్లింలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు ఫయాజ్ అహ్మద్(ఘని) మాట్లాడుతూ.. ఈ చట్టం అమల్లోకి వస్తే కలిగే ప్రయోజనాలను వివరించారు. వక్ఫ్‌పై వచ్చిన ఆదాయాన్ని ఇదివరకు ముస్లింలకు ఖర్చు చేసిన దాఖలాలు లేవని, ఈ సవరణ చట్టం ద్వారా ముస్లింల అభివృద్ధి కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రామానంద స్వామి, కమిటీ సభ్యుడు గాంధీ, మందస మండల నాయకులు దుదిష్టి పాత్రో, జిల్లా కిసాన్ మోర్చా వైస్ ప్రెసిడెంట్ రట్టి లక్ష్మణ్‌కుమార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు ఆశ్రయం



అభాగ్యుడిని ఆశ్రమంలో చేరుస్తున్న కాశీబుగ్గ పోలీసులు

కాశీబుగ్గ: మండుతున్న ఎండల నేపథ్యంలో నిరాధారణకు గురైన అభాగ్యులకు జిల్లా పోలీసుశాఖ ఆశ్రయం కల్పించనుంది. దీనిలో భాగంగా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు కాశీబుగ్గ పోలీసు డివిజన్ పరిధిలో ఉన్నటువంటి అనాథులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. జాతీయ రహదారి, రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న అనాథలను కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు ఆధ్వర్యంలో కాశీబుగ్గ పోలీసులు కోసంగిపురం జాతీయ రహదారి పక్కన లలిత అనాథ ఆశ్రమానికి తరలిస్తున్నారు.

ఎండలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి రీచార్డ్ బూన్

వజ్రపుకొత్తూరు రూరల్:

ప్రస్తుతం మండుతున్న ఎండలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రీచార్డ్ బూన్ సూచించారు. మండలంలోని నువ్వలరేవులో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందించారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మువ్వల పూర్ణచంద్ర, మాజీ ఎంపీటీసీలు వెంకటేష్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

విధిగా ఉచిత ప్రవేశాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఎంఈవో ధనుంజయ మజ్జి

కవిటి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాహక్కు చట్టం–2009 నిబంధనలను అనుసరించి 2025–26 విద్యా సంవత్సరంలో అన్ని ప్రైవేట్ పాఠశాలల్లోనూ విధిగా 25 శాతం సీట్లలో పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించాలని ఎంఈవో ధనుంజయ మజ్జి సూచించారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో అత్యవసర సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రైవేట్‌గా పాఠశాలలు నిర్వహిస్తున్న అన్ని విద్యాసంస్థలు ఈ నిబంధనలను విధిగా పాటించాలని ఆదేశించారు. దీనికోసం ఆన్‌లైన్‌లో అర్హులైన విద్యార్థులు తమ వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 1800 425 8599 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కంచిలి: సిమెంట్ రోడ్డు నిర్మాణాల్లో తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో వి.తిరుమలరావు స్పష్టం చేశారు. మండలంలోని నువాగడ గిరిజన పంచాయతీ పరిధిలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నటువంటి 5 సిమెంట్ రోడ్ల పనులను పరిశీలించారు. అదేవిధంగా నిర్మాణంలో ఉన్నటువంటి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను పరిశీలించారు. ఆయనతో పాటు ఏపీవో జి.ధనుంజయ ఉన్నారు.

మలేరియా రహిత సమాజానికి కృషి



కవిటి: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వజ్రపుకొత్తూరు రూరల్: మలేరియా రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అక్కుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు విజయ్‌కుమార్, జుత్తు చిన్ని అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా అక్కుపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పలాస: మనం నివసించే పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని రెంటికోట ప్రాథమిక ఆస్పత్రి వైద్యుడు సునీల్‌కుమార్ సూచించారు. పీహెచ్‌సీలో శుక్రవారం మలేరియా నివారణ దినోత్సవం నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్జీవో అధ్యక్షుడు బోనెల గోపాల్, సీహెచ్‌వో ఆదెమ్మ పాల్గొన్నారు.

కవిటి: మలేరియా రహిత సమాజమే మన అందరి లక్ష్యమని ఆర్.బెలగాం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రాకేష్, డాక్టర్ కవిత అన్నారు. మండలంలోని ఆర్.బెలగాం పీహెచ్‌సీ పరిధిలో అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ప్రజలంతా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్.బెలగాం పీహెచ్‌సీ పీహెచ్‌ఎన్ టి.రమణమ్మ, హెచ్‌వీటీ వెంకట భారతి, శివప్రసాద్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



పలాస: మలేరియాపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది



వజ్రపుకొత్తూరు రూరల్: అవగాహన ర్యాలీ చేపడుతున్న వైద్యాధికారులు

ఉగ్రవాదాన్ని మట్టుబెట్టాలి

ప్రపంచంలో ఏమూలన ఉగ్రవాదులు ఉన్నా మట్టుబెట్టాలని వక్తలు పిలుపునిచ్చారు. పహల్గాంలో పాక్ ప్రేరేపిత ఉగ్రమూకల దాడులను ఖండిస్తూ జిల్లావ్యాప్తంగా అన్నివర్గాల ప్రజలు శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఉగ్రవాదం నశించాలి.. ప్రపంచ శాంతి నెలకొల్పాలని నినాదాలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



వజ్రపుకొత్తూరు: పూండిలో కొవ్వొత్తుల ర్యాలీ



ఇచ్ఛాపురం టౌన్ పట్టణంలో తైక్వాండో క్రీడాకారుల ర్యాలీ



కంచిలి: కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు



ఇచ్ఛాపురం: ఉగ్రదాడులను ఖండిస్తున్న ముస్లిం పెద్దలు



మందస: మోకాళ్ల మీద కూర్చొని నివాళులర్పిస్తున్న దృశ్యం



కవిటి: పి.కొజ్జిరియాలో మృతులకు నివాళులర్పిస్తున్న సర్పంచ్ ఉప్పాడ నీలు తదితరులు